VC NEWS

# వేగుచుక్క


పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ నవంబర్ 02 శనివారం 2024

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:02 సంచిక: 105




ఒక్క అంగుళం భూమిని వదులుకోం

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



# సంక్షేమ విద్యార్థులకు కొత్త డైట్

**రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాలు, వసతిగృహాల విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారాన్ని అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పది రోజుల్లో అమల్లోకి తేవాలన్న సీఎం రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్: రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాలు, వసతిగృహాల విద్యార్థులకు మెరుగైన పౌష్టికాహారాన్ని అందించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. పది రోజుల్లో విద్యార్థులకు కొత్త డైట్ అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ మేరకు మార్పులు, చేర్పులు చేయాలని అధికారులకు స్పష్టంచేశారు. కాగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళాశిశు సంక్షేమ వసతిగృహాలు, గురుకులాలు, సాధారణ గురుకులాల్లో చదువుతున్న, ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు డైట్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచుతూ ఎస్సీ సంక్షేమశాఖ ఉత్తర్వులు జారీచేసింది. పెరిగిన డైట్‌ఛార్జీలు నవంబరు 1 నుంచే అమల్లోకి వస్తాయని పేర్కొంది. ఈ ఛార్జీలు అమలయ్యేలా సంక్షేమశాఖల కమిషనర్లు, గురుకుల సొసైటీల కార్యదర్శులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. డైట్, కాస్మెటిక్ ఛార్జీలు పెంచినందుకు బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఎస్సీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి శ్రీధర్, మైనార్టీ గురుకుల కార్యదర్శి తఫ్సీర్ ఇక్బాల్ సీఎంను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే వసతిగృహాలు, సంక్షేమ గురుకులాల విద్యార్థులు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి ముఖ్యమంత్రికి ధన్యవాదాలు చెబుతూ ప్లకార్డులు ప్రదర్శించారు.

**కమిటీ ఏర్పాటుచేసి..**

ప్రస్తుతం విద్యార్థులకు అందిస్తున్న డైట్‌ఛార్జీలు 2016–17లో పెంచినవని.. నిత్యావసరాలైన కూరగాయలు, వంటనూనెలు, చక్కెర, ఆహారధాన్యాలు, గ్యాస్ వంటివాటి ధరలు భారీగా పెరిగినందున డైట్‌ఛార్జీలు పెంచాల్సిన అవసరముందని ఎస్సీ సంక్షేమశాఖ కమిషనర్ 2022, 2023, 2024 సంవత్సరాల్లో ప్రభుత్వానికి తెలిపారు. కాగా 2024 జులై 18న చేసిన ప్రతిపాదనపై కొత్త ప్రభుత్వం ఉన్నతాధికారుల కమిటీని నియమించింది. ఈ కమిటీ గత ఏడేళ్ల నిత్యావసరాల ధరలు, నవోదయ విద్యాలయాల్లో అమలవుతున్న ధరలను పరిగణనలోకి తీసుకుని డైట్‌ఛార్జీలు 40%, కాస్మెటిక్‌ఛార్జీలు మార్కెట్ విలువ ప్రకారం పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం తెలిపారు. దీపావళి పండగ రోజున (అక్టోబరు 31న) ఎస్సీ సంక్షేమశాఖ పెరిగిన ధరలు అమలుచేసేందుకు ఉత్తర్వులు జారీచేసింది.

డైట్‌ఛార్జీలు పెంచుతూ సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. మంత్రితో పాటు, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, సంజయ్ ఇతర నేతలు ముఖ్యమంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు కోసం డైట్, కాస్మెటిక్ ఛార్జీలు గణనీయంగా పెంచారని మంత్రి సీతక్క అన్నారు.

ధరలు పెరుగుతున్నా గత భారాస ప్రభుత్వం డైట్ ఛార్జీలు పెంచలేదని దీంతో పిల్లలు అర్ధాకలితో ఉండాల్సి వచ్చిందని విమర్శించారు.

# కెటిఆర్ పాదయాత్ర చేసినా ప్రజలు నమ్మరు



**సొంత కుటుంబంపైనే కెటిఆర్‌కు నమ్మకం లేదు మెదక్ ఎంపి రఘునందన్ రావు విమర్శలు**

**సంగారెడ్డి:** కేటీఆర్‌కు కాంగ్రెస్ పది నెలల పాలనే విసుగొస్తే.. బీఆర్ఎస్ పాలనను ప్రజలు ఎలా భరించారో గుర్తు చేసుకోవాలని మెదక్ ఎంపి రఘునందన్ రావు నిలదీశారు. కేటీఆర్ మోకాళ్ల యాత్ర చేసిన ప్రజలు విశ్వసించరని విమర్శించారు. కేటీఆర్‌కు తన నాన్న, చెల్లె, బావతో పాటు ఎవరిపై నమ్మకం లేదని ఆరోపించారు. ఈ మేరకు మాజీ మంత్రి కేటీఆర్‌పై రఘునందన్ రావు సెటైర్లు గుప్పించారు. శుక్రవారం సంగారెడ్డిలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎంపీ రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తనకు రాజకీయాలు బంద్ చేయాలని ఉందని కేటీఆర్ అన్నారని.. బంద్ చేయ్ ..ఎవరు వద్దు అనలేదు కదా అని ప్రశ్నించారు. కేటీఆర్.. అమెరికా వెళ్లి బాత్ రూంలు కడుక్కోవాలని ఎంపీ రఘునందన్ రావు సెటైర్లు గుప్పించారు. అధికారంలో ఉన్న పదేళ్లు కేటీఆర్‌కు ప్రజలను కలిసే సమయం దొరకలేదా అని ప్రశ్నించారు. 'మీ నాన్న 10 నెలలుగా ఫామ్‌హౌస్‌లో ఉన్నారు..ఏమైనా నష్టం జరిగిందా' అని నిలదీశారు. కేటీఆర్ వచ్చింది ప్రజల కోసం కాదని.. ఆయన వచ్చింది డబ్బులు, అధికారం కోసం, ఫామ్‌హౌస్ కోసమని ఎంపీ రఘునందన్ రావు విమర్శలు చేశారు. ఫామ్‌హౌస్ కేసులో పాలేవో.. నీళ్లేవో తేలాలంటే సీసీ ఫుటేజ్ బయట పెట్టాల్సిందేనని అన్నారు. తెలంగాణలో ఆడవాళ్లు తాగుతారని కోరుట్ల ఎమ్మెల్యే అంటున్నారని.. తెలంగాణలో ఎక్కడైనా ఆడవాళ్లు తాగుతారా అని నిలదీశారు. దీపావళికి బజార్లలో బాంబులు పేలాయి కానీ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పిన కుక్క తోక పటాకులు కూడా పేలలేదని ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు.

## ప్రజా వ్యతిరేక విధానాలు ప్రశ్నిస్తే కేసులా



**మహబూబ్ నగర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టినా తాను భయపడనని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కేసులతో తమను నియంత్రించలేరని అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ప్రజా వ్యతిరేక విధానాలపై రేవంత్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే తమ నోరు మూయిస్తున్నారని ఫైర్ అయ్యారు. మంచి ప్రభుత్వం అంటే పేదల పక్షానా నిలబడాలని.. కానీ ఇక్కడ చెరువులు, నాలాల పేర్లు చెప్పి ఇళ్లను కూల్చివేస్తున్నారని.. ఇది ఎంతవరకు సమంజసం అని నిలదీశారు. కూలగొట్టిన ఇంటి స్థానంలో పేదలకు తిరిగి కొత్త ఇళ్లు కట్టివ్వాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. సోషల్ మీడియాలో పోస్టులు పెడితే తమపై కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. కేసు నమోదైన వరద భాస్కర్ కుటుంబాన్ని తాము పలకరించడానికి వెళ్తే భాస్కర్ తల్లి కన్నీరు పెట్టిందని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తనను పోలీసులు చిత్రహింసలకు గురిచేశారని వరద భాస్కర్ తమకు చెప్పి ఆవేదన వ్యక్తం చేశారని అన్నారు.



## అనలాగ్ స్పేస్ మిషన్‌ను ప్రారంభించిన ఇస్రో

ఇస్రో ప్రారంభించిన తొలి భారీ అనలాగ్ మిషన్ ఇదే

బేస్ స్టేషన్లలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు సన్నాహాలు

2లో..

## ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత



రైతులను నట్టే ముంచి ..డైవర్షన్ పాలిటిక్స్

వ్యతిరేతను ప్రజల్లోకి తీసుకుని వెళ్లే ఆలోచన

అవసరమైతే పాదయాత్ర చేస్తామన్న కెటిఆర్

2లో..



## కాంగ్రెస్ కమిషన్‌లా బిసి కమిషన్


కమిషన్ విచారణకు హాజరైనా సమయమివ్వలేదు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శలు

2లో..

## తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

**తిరుమల :** ఏడుకొండలస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయాయి. టీబీసీ గెస్ట్‌హౌస్ వరకు భక్తులు క్యూలైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. నిన్న స్వామివారిని 63,987 మంది భక్తులు దర్శించుకోగా 20,902 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు మొక్కుల ద్వారా సమర్పించుకున్న కానుకల ద్వారా శ్రీవారికి రూ. 2.66 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.



## మహారాష్ట్రలో ఎలాంటి గ్యారంటీలను అమలు చేయడం లేదు

**గ్యారంటీల అమలుతో రాష్ట్రం దివాలే**

**మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ : కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కీలక ప్రకటన చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఆరు, ఏడు అంటూ ఎలాంటి గ్యారంటీలూ ప్రకటించడం లేదని స్పష్టం చేశారు. బడ్జెట్ ఆధారంగా హామీలు ప్రకటించాలని.. లేదంటే రాష్ట్రం దివాలా పరిస్థితికి చేరుతుందని వ్యాఖ్యానించారు. విలేకరులతో ఖర్గే మాట్లాడుతూ.. 'త్వరలో జరగబోయే మహారాష్ట్ర ఎన్నికల్లో 5, 6, 10, 20 ఇలా ఏ ఒక్క హామీలను ప్రకటించడం లేదు. బడ్జెట్ ఆధారంగా హామీలు ప్రకటించాలి. లేదంటే రాష్ట్రం దివాలా పరిస్థితికి చేరుతుంది. ప్రణాళికా రహిత విధానం ఆర్థిక ఇబ్బందులకు దారి తీస్తుంది. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే.. భవిష్యత్తు తరాలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. రోడ్లు వేసేందుకు కూడా డబ్బు లేకపోతే.. ప్రభుత్వంపై ప్రజలు తిరగబడతారు. ప్రభుత్వం విఫలమైతే భవిష్యత్తు తరానికి చెడ్డపేరు తప్ప మరొకటి మిగలదు' అంటూ ఎన్నికల హామీలపై ఖర్గే వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ప్రజలు ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు పలు హామీలను ఇస్తున్న విషయం తెలిసిందే. కర్ణాటకలో ఐదు గ్యాంరటీలతో, తెలంగాణలో ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చింది. అయితే, గ్యారెంటీల పేరుతో ఆకర్షించి ఓట్లు వేయించుకున్న ఆ పార్టీ ఇప్పుడు ఉచిత పథకాలను అమలు చేయలేక చేతులెత్తేస్తున్నది. కర్ణాటకలో అధికారంలోకి వచ్చిన నెల రోజులకే ఆడంబరంగా ప్రారంభించిన ఉచిత బస్సు పథకానికి ఏడాదిన్నరకే మంగళం పాడేందుకు సిద్ధమైంది. ఈ పథకాన్ని



నిలిపేసేందుకు ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టినట్లు సమాచారం. తెలంగాణలో సైతం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో హస్తం పార్టీ విఫలమవుతోందని విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఈ పరిణామాల దృష్ట్యా రాబోయే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఈ హామీలపై కాంగ్రెస్ పార్టీ వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది.

## ఉచిత బస్సు ప్రయాణంపై కీలక ప్రకటన

**నంద్యాల:** ఏపీలో మహిళలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఉచిత బస్సు ప్రయాణంపై రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. దీపం పథకం మొదలుకానున్న నేపథ్యంలో మరో పథకంపై మంత్రి గుడ్ న్యూస్ చెప్పారు. సంక్రాంతి లోపల ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం చేయవచ్చని వెల్లడించారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఇప్పటికే పెంచిన పింఛన్లను పంపిణీ చేస్తున్నామని.. ఇక దీపం పథకాన్ని మొదలు పెడుతున్నామని తెలిపారు. అలాగే సంక్రాంతి లోపల ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచితంగా ప్రయాణం చేసే చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఉద్యోగాలు కల్పించేందుకు ఎన్నో పరిశ్రమలు తీసుకొస్తున్నామన్నారు. తల్లికి చెల్లికి న్యాయం చేయలేని జగన్.. చంద్రబాబు ప్రభుత్వంపై మాట్లాడే అర్హత లేదన్నారు. ప్రతిపక్ష హోదా కూడా లేని జగన్ ఎన్ని మాటలు చెప్పినా జనం నమ్మరన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా ప్రభుత్వానికి ప్రజల మద్దతు సంపూర్ణంగా ఉందని తెలిపారు. ప్రతిపక్ష హోదా కూడా దక్కని జగన్ ఏవేవో ఊహించుకొని మాట్లాడుతున్నారన్నారు. రెండు రోజులు ఏపీలో.. ఆరు రోజులు బెంగళూరు ప్యాలెస్‌లో ఉండే జగన్‌కు ప్రజల గురించి ఏం తెలుసు అంటూ మంత్రి బీసీ జానార్ధన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎన్ఆర్ఐలకు అర్థం చెప్పిన మంత్రి లోకేశ్

న్యూఢిల్లీ : ఇటీవల జరిగిన ఏపీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో రెండు లక్షల రూపాయలు ఖర్చుపెట్టి టిక్కెట్ కొనుక్కొని వచ్చి మరీ ఓటేశారని అభినందించారు. కొందరు ఏడాదిపాటు ఏపీలోనే ఉండి సేవలందించారని మెచ్చుకున్నారు. ఎన్నికల్లో 175కి 175 అన్నవారి ముఖాలు మాడిమసైపోయాయని, ఈ గెలుపు ప్రపంచంలో ఉన్న తెలువారందరిది అని లోకేశ్ అన్నారు. ఈ మేరకు అమెరికాలో గురువారం మాట్లాడారు. ఎన్నారైలు అంటే ఎంతో నమ్మకమైన భారతీయులు అని మంత్రి నారా లోకేశ్ కొత్త అర్థం చెప్పారు. "అందరూ మిమ్మల్ని ఎన్ఆర్ఐలు అని అంటారు. కానీ నేను మాత్రం ఎప్పుడూ మిమ్మల్ని ఎంఆర్ఐలు అనే అనుకుంటా. కానీ ఎంఆర్ఐ అంటే మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్. మీ జోష్, ఎనర్జీ చూస్తుంటే నేను అట్లాంటాలో ఉన్నానా?. అమలాపురంలో ఉన్నానా? అనే డౌట్ వస్తోంది. మీరు దేశాన్ని, రాష్ట్రాన్ని ప్రేమిస్తారు. అమెరికాలో ఉన్నా మీ మనసంతా రాష్ట్రం వైపే ఉంటుంది. రాష్ట్రం బాగుండాలి, అభివృద్ధి చెందాలి అని కోరుకుంటారు. అందుకే మీరు మోస్ట్ రిలయబుల్ ఇండియన్స్. సంపాదించిన రూపాయిలో 10 పైసలు సొంతగడ్డకు ఖర్చు పెడుతున్నారు" అని కొనియాడారు. అట్లాంటా సమీపంలోని కుమ్మింగ్‌లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని మంత్రి నారా లోకేశ్ ఆవిష్కరించాను. ఈ సందర్భంగా హెలికాప్టర్ పైనుంచి మంత్రి మీద పూలవర్షం కురిపించి ఎన్ఆర్ఐ టీడీపీ కార్యకర్తలు అభిమానం చాటుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో లోకేశ్ మాట్లాడుతూ.. "ప్రపంచవ్యాప్తంగా తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహోన్నత వ్యక్తి ఎన్టీఆర్ ఆశయ సాధనకు తెలుగుదేశం పార్టీ కృషి చేస్తోంది. గత ప్రభుత్వంలో చేయని తప్పునకు బాబుగారిని జైలులో బంధించారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగువారంతా ఎన్ఆర్ఐలతో సహా రోడ్డెక్కి ఆందోళనలు చేశారు. ఆ సమయంలో మీరు ఇచ్చిన మద్దతు మాకు కొండంత బలాన్నిచ్చింది" అని నారా లోకేశ్ పేర్కొన్నారు.

రెడ్‌బుక్‌లో రెండో అధ్యాయం మొదలు...

ఇక వారం రోజుల అమెరికా పర్యటనలో రాష్ట్రాన్ని ప్రమోట్ చెయ్యడానికి అవిశ్రాంతంగా ఇన్వెస్టర్స్‌ని కలిశానని లోకేశ్ చెప్పారు. "నిర్విరామంగా ఇన్వెస్టర్లతో సంప్రదింపులు జరిపాను. కానీ ఈ రోజు మిమ్మల్ని చూసిన తరువాత నాకు కిక్ వచ్చింది. ఎన్ఆర్ఐలు కూడా సైకో జగన్ బాధితులే. రెడ్ బుక్‌లో ఒక చాప్టర్ అయిపోయింది. రెండోది ఓపెన్ అయింది. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సహకారంతో త్వరలో మూడో చాప్టర్ తెరవబోతున్నా. అతి పెద్ద వ్యవస్థలో కొన్ని పొరపాట్లు జరుగుతుంటాయి. మా దృష్టికి తెస్తే సరిచేసుకుంటాం. మీకు ఉన్న సమస్యలు కొన్ని నా దృష్టికి తీసుకొచ్చారు. వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తా. తెలుగువారు ప్రపంచాన్ని శాసించేస్థాయికి ఎదగాలన్నది బాబుగారి ఆశయం. ఎన్ఆర్ఐలు ఏపీలో పెట్టుబడి పెట్టండి, మీకు అండగా నిలిచే బాధ్యత నాది. అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా ముందుకు తీసుకెళ్తాం" అని మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు.

## ఒక్క అంగుళం భూమిని వదులుకోం

న్యూఢిల్లీ: భారత్–చైనా సరిహద్దులో బలగాల ఉపసంహరణ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతమున్న కేంద్ర ప్రభుత్వం దేశానికి సంబంధించిన ఒక్క అంగుళం భూమి విషయంలో కూడా రాజీపడబోమని ఆయన వ్యాఖ్యానించారు. "21వ శతాబ్దపు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మనం మన సైన్యాలను, మన భద్రతా దళాలను ఆధునిక వనరులతో బలోపేతం చేసుకుంటున్నాం. ప్రపంచంలో అత్యాధునిక సైన్యాల జాబితాలో చేర్చుతున్నాం. ఈ ప్రయత్నాలకు ఆధారం రక్షణ రంగంలో స్వావలంబన" అని నరేంద్ర మోదీ అన్నారు. గుజరాత్‌లోని కచ్ఛ్‌లో ఉన్న సర్ క్రీక్ ప్రాంతంలోని లక్కీ నాలా వద్ద బీఎస్ఎఫ్, ఆర్మీ, నేవీ, వైమానిక దళ సిబ్బందితో ఇవాళ (గురువారం) ఆయన దీపావళిని జరుపుకున్నారు. "నేడు అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడమే లక్ష్యంగా వేగంగా ముందుకు సాగుతున్న వేళ మీరందరూ (సైనికులు) ఈ కలల రక్షకులు" అని మోదీ అన్నారు. కాగా తూర్పు లడఖ్ దగ్గర చైనా–భారత్ బలగాల ఉపసంహరణ ప్రక్రియ దాదాపు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రధానమంత్రి మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా సరిహద్దు పర్యాటకం జాతీయ భద్రతకు సంబంధించిన అంశమని, దీని గురించి పెద్దగా చర్చించలేదని మోదీ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పటిలాగానే ఈ సంవత్సరం కూడా దీపావళి పండగను సైనికుల మధ్య జరుపుకున్నారు. ఇందుకోసం ఆయన ఈ రోజు (గురువారం) గుజరాత్‌లోని కచ్ఛ్‌లో సర్ క్రీక్‌లోని లక్కీ నాలా వద్ద బీఎస్ఎఫ్, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ సిబ్బందిని కలిశారు. ఆర్మీ యూనిఫాం ధరించి సైనికులతో గడిపారు. అక్కడున్న సైనికులకు ఆయన పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సైనికులకు స్వీట్లు పంచిపెట్టారు.

## అనలాగ్ స్పేస్ మిషన్‌ను ప్రారంభించిన ఇస్రో

**న్యూఢిల్లీ :** భారత అంతరిక్ష సంస్థ ఇస్రో తొలి అనలాగ్ స్పేస్ మిషన్‌ను లద్దాఖ్ లేహ్‌లో ప్రారంభించింది. హ్యూమన్ స్పేస్ ఫ్లైట్ సెంటర్, ఆకా స్పేస్ స్టూడియో, లడఖ్ విశ్వవిద్యాలయం, ఐఐటీ బాంబే, లడఖ్ అటానమస్ హిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సహకారంతో ఈ మిషన్ చేపట్టింది. మిషన్‌లో భాగంగా ఇస్రో లేహ్‌లో ఓ స్పేస్‌ను సృష్టిస్తుంది. ఇందులో మరో గ్రహంలో పరిస్థితులు ఎలా ఉంటాయో అలాగే ఉంటాయి. దాంతో భూమికి దూరంగా ఉన్న ప్రదేశాల్లోని బేస్ స్టేషన్లలో ఎదురయ్యే సమస్యలను ఎదుర్కొనేందుకు ఇస్రో సన్నాహాలు చేయనున్నది. ఇస్రో లేహ్‌లో ప్రారంభించిన తొలి భారీ అనలాగ్ మిషన్ మిషన్ ఇదే. అంతరిక్షం, ఏదైనా ఖగోళ వస్తువు తరహాలో వాతావరణం, పర్యావరణాన్ని పోలి ఉంటుంది. నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా శాస్త్రవేత్తలు తీర్చిదిద్దుతుంటారు. అందులో వ్యోమగాములకు శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. రాబోయే రోజుల్లో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ కీలకమైన మిషన్లు చేపట్టనున్న విషయం తెలిసిందే. ఇందులో కీలకమైన మిషన్ గగన్‌యాన్. ఇందులో మిషన్‌లో తొలిసారిగా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపబోతున్నది. ఈ పరిస్థితుల్లో అనలాగ్ మిషన్ కీలకంగా మారనున్నది. రాబోయే కాలంలో వ్యోమగాములకు శిక్షణ ఇచ్చేందుకు అవకాశం ఉంటుంది. లద్దాఖ్‌లోని వాతావరణ పరిస్థితులు కొంత వరకు చంద్రుడు, మార్స్ పరిస్థితులను పోలి ఉంటాయి. చల్లని, పొడి వాతావరణం, ఎక్కువ ఎత్తు ఉండడంతో ఇక్కడి నుంచి దీర్ఘకాలిక అంతరిక్ష మిషన్ల కోసం సన్నాహాలకు ఉపయుక్తంగా ఉండనున్నది. అనలాగ్ మిషన్‌లో పాల్గొనేవారంతా ఇతర గ్రహాలు, స్పేస్‌షిప్‌ల్లో ఉండే పరిస్థితులు అనుభవిస్తారు. భవిష్యత్‌లో ఇక్కడే అంతరిక్ష యాత్రకు సిద్ధం కానున్నారు. నిర్వహణ, మానసిక స్థితిని సైతం శాస్త్రవేత్తలు పర్యవేక్షించనున్నారు.

కాంగ్రెస్ కమిషన్‌లా బిసి కమిషన్

## కమిషన్ విచారణకు హాజరైనా సమయమివ్వలేదు



కరీంనగర్: బీసీ కమిషన్ పనితీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ కమిషన్ కాంగ్రెస్ కమిషన్‌లా తయారైందని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కమిషన్‌ను కోరాం. భారాస తప్ప ఇతర పార్టీల నుంచి ఎవరూ రాలేదు. కాంగ్రెస్, భాజపా నేతలు ఎందుకు రాలేదు? కొత్త కమిషన్ వేయాలని కోర్టు చెప్పిన తర్వాత అభిప్రాయ సేకరణ ఎందుకని కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక సంస్థల రిజర్వేషన్లపై ప్రజాభిప్రాయ సేకరణ కోసం శుక్రవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన బహిరంగ విచారణకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కమిషన్ మీద ఉన్న గౌరవంతో ఇక్కడికి వస్తే మాట్లాడేందుకు సమయం కూడా ఇవ్వడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ నుంచి ఒక్కరు కూడా కమిషన్ ముందుకు రాలేదని, కమిషన్ మీద కాంగ్రెస్‌కు నమ్మకం లేదు కాబట్టే ఎవరు రాలేదని ఎద్దేవా చేశారు. డెడికేటెడ్ కమిషన్‌తోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. హైకోర్టు తీర్పుకు అనుగుణంగా ప్రభుత్వం నడుచుకోవాల్నారు. కాగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని రాజకీయ పార్టీలు, బీసీ సంఘాల ప్రతినిధులు ప్రజలు అభిప్రాయాలు చెప్పేందుకు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ విచారణ కొనసాగనున్నది. వచ్చే నెల 13 వరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టనున్నది. కాంగ్రెస్ నుంచి ఒక్కరు కూడా కరీంనగర్‌లో బీసీ కమిషన్ బహిరంగ విచారణకు రాలేదని భారాస ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి విమర్శించారు. బహిరంగ విచారణలో ఆయనతో పాటు భారాస నేతలు నిరసన తెలిపారు. కమిషన్ మీద కాంగ్రెస్ నేతలకు నమ్మకం లేనందునే ఎవరూ రాలేదన్నారు. 'బీసీ కమిషన్‌కు విలువ లేదని హైకోర్టు చెప్పింది.

# ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత



**హైదరాబాద్:** ప్రజల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఉందని, రాజకీయంగా తమకు అనుకూలంగా ఉందిన విపక్ష బిఆర్ఎస్ భావిస్తోంది. దీనిని తమకు అనుకూలంగా మలచుకునేందుకు ప్రజల్లోకి చొచ్చుకు వెళ్లాలని నిర్ణయించింది. ప్రభుత్వ కార్యక్రమాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా కెటిఆర్ పాదయాత్ర ఆలోచన చేస్తున్నారు. అలాగే కార్యకర్తల ఆకాంక్షల మేరకు భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తెలిపారు. పార్టీ కార్యకర్తలు అంతా కోరుతున్నందున భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని కేటీఆర్ అన్నారు. ఎక్స్ వేదిగా నిర్వహించిన 'ఆస్క్ కేటీఆర్' క్యాంపెయిన్‌లో యూజర్లు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. దేశంలోని అనేక పార్టీల నేతలు ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టడంతోపాటు, పార్టీలను బలోపేతం చేసేందుకు పార్టీ అధ్యక్షులు పాదయాత్రలు చేస్తున్నారు, మీరెప్పుడు చేస్తారని అడిగారు. దీనికి స్పందించిన కేటీఅర్ ఖచ్చితంగా తన పాదయాత్ర ఉంటుందని వెల్లడించారు. దాదాపు గంటన్నపాటు సాగిన ఈ సంభాషణలో కేటీఆర్ అనేక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. కాంగ్రెస్ పాలన తెలంగాణకు ఒక శాపంగా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే ఉద్దేశం ఏమాత్రం లేదు. అందుకే అబద్దాలు, అసత్యాల మీద సమయం గడుపుతూ ప్రజలను మోసం చేస్తున్నది. గత పది నెలల కాలంలో కాంగ్రెస్ పార్టీ చేసిన ఒక్క మంచి కూడా గుర్తుకు రావడం లేదు. అబద్ధపు హామీల మీద ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ నుంచి ఇంతకంటే గొప్ప పరిపాలన ఆశించలేం. తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రాజకీయ వేధింపులను ప్రారంభించింది. అయితే వీటికి భయపడేది లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. సన్నవడ్లకు కూడా బోనస్ ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ హామీ బోగస్‌గా మారిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి ఓట్లు వేసి మద్దతు ధర లేక రైతుబంధు లేక నష్టపోతున్న రైతన్నల తరఫున పోరాడుతామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పాలన ఫ్రమ్ ఢిల్లీ, టూ ఢిల్లీ, ఫర్ డిల్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు. నాలుగేండ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారం పోవడం ఖాయమని కేటీఆర్ అన్నారు. అయితే కొత్త ప్రభుత్వానికి ప్రస్తుత సర్కార్ చేసిన నష్టం నుంచి తెరుకొని ముందుకు తీసుకుపోవడం అతిపెద్ద సవాలుగా మారుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక ప్రగతి పూర్తిగా పతనమైందని చెప్పారు. అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం వెనక్కి పోతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆదాయ వనరులు నుంచి మొదలు వ్యవసాయ రంగం, అన్ని రంగాలు తిరోగమనంలో ఉన్నాయన్నారు. నిరుద్యోగిత పెరిగిందన్నారు. తెలంగాణ నుంచి అనేక కంపెనీలు వెనక్కి వెళ్లిపోతున్నాయని చెప్పారు. ఈ అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళికలు ఉన్నాయో ఎవరికీ తెలియడం లేదన్నారు. కాంగ్రెస్ పాలన వలన జరుగుతున్న నష్టాన్ని పూడ్చుకోవడం అప్పుడప్పుడే సాధ్యం కాదు అన్నారు. కాంగ్రెస్ దళారీ ప్రభుత్వం రైతులను నిండా ముంచిందని కేటీఆర్ ఆరోపించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవడం, పంట కొనుగోళ్లపై ఆయన స్పందించారు. వానాకాలం వరికోతలు సాగుతున్నప్పటికీ.. రైతుబంధు, రైతుభరోసా ఊసే లేదని ఆక్షేపించారు. కనీసం పంట కొనుగోలు చేయడం లేదని.. దీంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అకాల వర్షాలకు చాలాచోట్ల కల్లాల్లో, మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసిందని పేర్కొన్నారు. ఈ సీజన్లో 91 లక్షల 28 వేల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామని చెప్పి.. అక్టోబర్ 28 వరకు 913 మంది రైతుల నుంచి కేవలం 7,629 టన్నుల ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేశారని తెలిపారు. 'రైతన్న అంటే ఎంత నిర్లక్ష్యమో చూడండి' అని వ్యాఖ్యానించారు. దళారులతో కుమ్మక్కైన కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేయడం లేదని.. ఇప్పటివరకు పూర్తిస్థాయిలో మిల్లుల కేటాయింపు జరగలేదని కేటీఆర్ విమర్శించారు. సేకరించిన ధాన్యాన్ని ఏ మిల్లుకు పంపాలో తెలియక ఐకేపీ కేంద్రాల్లోను కొనుగోలు పక్రియ నిలిచిందన్నారు. కనీసం పండించిన చేసిన పంటను కొనుగోలు కూడా చేయడం లేదని.. ఫలితంగా రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అకాల వర్షాలకు చాలా చోట్ల కల్లాలలో, మార్కెట్ యార్డుల్లో ధాన్యం తడిసి ముద్దయ్యిందని పేర్కొన్నారు. ఈ సీజన్‌లో 91.28 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరిస్తామన్నారని.. అక్టోబర్‌లో నెలలో 8.16 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుందని గుర్తు చేశారు. అక్టోబర్ 28 నాటికి వరకు 913 మంది రైతుల నుంచి కేవలం 7,629 టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారని.. దాన్ని బట్టి రైతన్న అంటే ఎంత నిర్లక్ష్యమో ప్రజలు చూడాలన్నారు. దళారులతో కుమ్మక్కు అయిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదని.. నేటి వరకు పూర్తి స్థాయిలో మిల్లుల కేటాయింపు జరగనేలేదని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ఏ మిల్లుకు పంపాలో తెలియక.. ప్రారంభించిన ఐకేపీ కేంద్రాల్లోను కొనుగోలు పక్రియ నిలిచిందన్నారు. రైతులు కల్లాల్లో కన్నీళ్లు పెడుతుంటే... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం డైవర్షన్ పాలిటిక్స్‌లో బిజిబిజీగా ఉన్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు శాపంగా మారిందని ఆయన అన్నారు. ప్రస్తుత పాలన ఫ్రం దిల్లీ, టూ దిల్లీ, ఫర్ దిల్లీ అన్నట్లుగా తయారైందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ పాలనలో జరిగిన పతనం నుంచి తెలంగాణ కోలుకోవడం అసాధ్యమని చెప్పారు. ప్రజలపక్షాన కొట్లాడటమే ప్రస్తుతం తమముందున్న బాధ్యత అని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో భారాస తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. 'పార్టీ కార్యకర్తలు అంతా కోరుతున్నందున కచ్చితంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతస్థాయి పాదయాత్ర నిర్వహిస్తానని అన్నారు. కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు. పార్టీకి మార్గదర్శనం చేస్తున్నారు. పార్టీ నేతలపై వేధింపులు,అక్రమ కేసులు పెడుతున్న పోలీసులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. మా సోషల్ మీడియా వారియర్లు అద్భుతంగా పని చేస్తున్నారని కేటీఆర్ తెలిపారు. తాము అధికారంలో ఉన్న పదేండ్లలో ఏనాడూ ఇతరుల కుటుంబ సభ్యులను రాజకీయ అంశాల్లోకి లాగలేదు. దాదాపు రెండు దశాబ్దాల తన రాజకీయ జీవితంలో కుటుంబ సభ్యులను అవహేళన చేసి మాట్లాడినప్పుడు, రాజకీయాలు వదిలేయాలన్నంత భావోద్వేగానికి గురైన విషయాన్ని కేటీఆర్ ప్రస్తావించారు. కేవలం రాజకీయాల కోసం ఇతరుల కుటుంబ సభ్యులను ఎందుకు లాగుతారో అర్థంకాదని, ఈ విషయం తనకు అత్యంత బాధ కలిగిస్తుందన్నారు.

నీచమైన రాజకీయాల కోసం తన కుటుంబాన్ని లాగుతున్న ముఖ్యమంత్రి పైన, ఆయన వందిమాగదుల పైన ప్రజల మద్దతుతో పోరాటం చేస్తానని చెప్పారు. చెరువుల సంరక్షణ పేరుతో ప్రభుత్వం పేపర్ మీద గొప్పలు చెబుతున్నప్పటికీ అసలైన ఎజెండా అవినీతి మాత్రమే. మూసీ బ్యూటిఫికేషన్‌కి తాము వ్యతిరేకం కాదు. కానీ మూసీ లూటిఫికేషన్‌కి వ్యతిరేకం. మూసీ ప్రక్షాళణ దేశంలోనే అతిపెద్ది అవినీతి స్కాం అవుతుంది. హైడ్రా కేవలం కొందరిని మాత్రమే లక్ష్యంగా చేసుకొని పనిచేస్తుంది. ఇప్పటిదాకా ఒక్క పెద్ద బిల్డర్‌ని కూడా హైడ్రా ముట్టుకోలేదు. కేవలం పేదలను మధ్యతరగతి ప్రజలను మాత్రమే నిర్ధయగా దోచుకున్నదని కెటిఆర్ దుయ్యబటటారు.

## మాది మంచి ప్రభుత్వమే..కానీ మెతక కాదు



**ఏలూరు:** గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలు సరిగా అమలు చేయలేదు.. కుటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేసి చూపుతోందని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. దీపం పథకం కింద ఏడాదికి 2,684 కోట్లు, ఐదేళ్లకు13,425 కోట్లు ఖర్చు చేస్తుందని తెలిపారు.

దీపం ఉచిత సిలిండర్లు కోటి ఎనిమిది లక్షల మందికి ఇవ్వబోతున్నామని పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఏలూరు జిల్లా ద్వారక తిరుమల మండలం ఐఎస్ జగన్నాథపురంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దీపం పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. 14 ఏళ్ల క్రితం ఐఎస్ జగన్నాథపురం ఆలయానికి వచ్చాను.. ఇక్కడ స్వయంభుగా వెలసిన లక్ష్మీనరసింహ స్వామిని ఎప్పుడు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటానని చెప్పారు. లక్ష్మీ నరసింహస్వామి 14 ఏళ్ల పరీక్ష పెట్టాడు.. గతంలో ఎదురైన ఓటమితో జీవితం అంధకారం అయ్యింది.. అలాంటి సమయంలో జనసైనికులతో పాటు ధైర్యం ఇచ్చింది లక్ష్మీనరసింహస్వామి అని పవన్ కళ్యాణ్ అన్నారు. దీపం పథకం కేవలం వంటింట్లో వెలగడానికే కాదు.. పేదల ఆకలి తీర్చడానికి అని తెలిపారు. ఐఎస్ జగన్నాథపురం ఆలయానికి రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టబోతున్నామని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలన్నీ పక్కాగా అమలు చేస్తాం.. హామీలు అమలు చేయకపోతే జనసైనికుల ప్రేమ ఎంత బలంగా ఉంటుందో కోపం కూడా అంతే బలంగా ఉంటుందని చెప్పారు. పదవి వచ్చాక పదింతలు ఎక్కువగా కష్టపడే వ్యక్తిని అని అన్నారు. అభిమానులు సినిమా పేర్లు జపించడం కంటే భగవన్నామస్మరణ చేస్తే ఇంకా బాగుంటుంది.. సినిమాలో ఒక సరదా మాత్రమే.. సినిమాలు ఉండాలని అన్నారు. వైసీపీ చేసిన తప్పుడు విధానాల వల్ల వ్యవస్థ పాడయింది.. వైసీపీ ఓడి 11 సీట్లు మిగిలినా వాళ్ళ నోళ్లు మూతపడటం లేదు.. వైసీపీ నేతలకు చింత చచ్చినా పులుపు చావలేదు. వైసీపీకి 11సీట్లువచ్చినా విమర్శలు మానలేదు. మూడు నెలలుగా వైసీపీ నేతలకు నోరు ఎక్కువైంది. ఇది మంచి ప్రభుత్వమే కానీ, మెత్తని ప్రభుత్వం కాదు. మీకు యుద్ధమే కావాలనుకుంటే సిద్ధమే.. కానీ అభివృద్ధికి ఉపయోగపడే యుద్ధం కావాలి. ఆడబిడ్డలకు ఆపద కలిగించినా, చాలా తీవ్రంగా పరిగణిస్తాం. నేరాలు పెరిగాయి, శిక్షలు తగ్గాయి. పోలీసులకు డిజిటల్ క్రైమ్ యాక్టు తీసుకురాబోతున్నాం' అని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. లక్ష్మీ నరసింహ స్వామి సాక్షిగా చెబుతున్న భవిష్యత్తులో వైసీపీ వాళ్ల నోటి నుంచి ఇంకేమీ రాకుండా చేస్తామని పవన్ కళ్యాణ్ అన్నారు. ఇది మంచి ప్రభుత్వమే కానీ మెతక ప్రభుత్వం కాదని అన్నారు. వైసీపీ వాళ్ళకి యుద్ధమే కావాలంటే యుద్ధమే ఇస్తాం.. గొడవే కావాలంటే అభివృద్ధికి పాటుపడే గొడవ ఇస్తామని పేర్కొన్నారు. ఆడపిల్లల మాన, ప్రాణాలకు ఎక్కడ ఇబ్బంది కలగకుండా చూడటమే లక్ష్యమని తెలిపారు. సోషల్ మీడియాలో మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని పవన్ సూచించారు. తాము ఎవరికీ అన్యాయంగా ఎదురు తిరగలేదు.. ఆడబిడ్డల గురించి, ఇంటి ఆడపడుచుల గురించి అసభ్యంగా మాట్లాడలేదని పవన్ కళ్యాణ్ అన్నారు. సనాతన ధర్మంపై పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సనాతన ధర్మంపై రకరకాలుగా కొంతమంది మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఈ నేలపై అందరూ నివసిస్తున్నారని.. తాను అన్ని మతాలను గౌరవిస్తానని స్పష్టం చేశారు. మన సనాతన ధర్మాన్ని, హిందూ దేవాలయాలకు వెళ్లినపుడు కొన్ని విలువలు పాటించాలని సూచించారు. ఐయస్ జగన్నాథపురం లోనే మన సనాతన ధర్మం ప్రపంచానికి దిక్సూచిగా ఉండాలని దీక్ష చేపట్టానని గుర్తుచేశారు. సనాతన ధర్మం ఉంటే తప్పు.. ఈ దేశం నిలబడదని ఉద్ఘాటించారు. హైందవ ధర్మాన్ని, హిందూ ధర్మాన్ని కించపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు పడితే, సహించేది లేదని పవన్ కళ్యాణ్ వార్నింగ్ ఇచ్చారు. సనాతన ధర్మ పరిరక్షణ విభాగాన్ని జనసేన పార్టీ తరపున ప్రారంభిస్తున్నామని తెలిపారు.

## త్వరలోనే సిఎం రేవంత్ రెడ్డి ఔట్

**హైదరాబాద్:** త్వరలోనే సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి ఊడిపోవడం ఖాయం అని బీజేఎల్పీ నాయకుడు యేలేటి మహేశ్వర్ రెడ్డి జోస్యం చెప్పారు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలలో ఎవరో ఒకరు ముఖ్యమంత్రి అవుతారని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆ పార్టీ నేతలపై యేలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన కామెంట్స్ చేశారు. బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డికి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. 2025 జూన్ నుంచి డిసెంబర్‌లోగా తెలంగాణకు కొత్త ముఖ్యమంత్రి రాబోతున్నారని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యేల ఫిరాయింపుల అంశం కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి తలనొప్పిగా మారిందన్నారు. కాంగ్రెస్ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు కేసీఆర్‌కు టచ్‌లో ఉన్నారని మహేశ్వర్ రెడ్డి చెప్పుకొచ్చారు. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నేతలు సైతం రేవంత్ వైఖరిపై తీవ్ర ఆగ్రహంలో ఉన్నారన్నారు. యేలేటీ. కేరళలో ప్రియాంక గాంధీ నామినేషన్ వేసేటప్పుడు వెళ్లినా.. రేవంత్‌ను రాహుల్ గాంధీ కలవలేదన్నారు. ఢిల్లీలో మూడుసార్లు రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతో.. ఖాళీగా తిరిగి వచ్చారన్నారు. దీనికి సంబంధించి పక్కా ఆధారాలు తన వద్ద ఉన్నాయని మహేశ్వర్ రెడ్డి చెప్పుకొచ్చారు. మూసీ అంశాన్ని ఒరిజినల్ కాంగ్రెస్ మంత్రులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని బీజేఎల్పీ నేత వ్యాఖ్యానించారు. ఇదే విషయాన్ని వారు తలు ఎప్పటికప్పుడు అధిష్టానానికి చెప్తున్నారని పేర్కొన్నారు. నేరుగా కొంత మంది, మెయిళ్ల ద్వారా కొంతమంది, ఇతర మార్గాల ద్వారా మరికొంత మంది చేరవేస్తున్నట్లు మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని మంత్రులు, అధిష్టానం నమ్ముతుందని.. ఇది సాధారణ ప్రజల్లోకి సైతం చేరిందన్నారు. సెలక్షన్, కలక్షన్, కరప్షన్ అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విధానమని కాంగ్రెస్ హైకమాండ్‌కు ఆధారాలతో సహా వెళ్లినట్లు తమకు పక్కా సమాచారం ఉందన్నారు. మూసీ, హైడ్రా మీద కాంగ్రెస్ అధిష్టానానికి అనేక అనుమానాలు ఉన్నాయని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి.. వైఎస్ఆర్ కంటే ప్రమాదకరం అనే భావనలో కాంగ్రెస్ హైకమాండ్ ఉందన్నారు. రేవంత్ రెడ్డి సెల్ఫ్ ఎజెండా మీద మాజీ కేంద్ర మంత్రి పల్లం రాజు పూర్తి నివేదికను సోనియా గాంధీకి అందజేశారని అన్నారు. లక్షా యాభై వేల కోట్లతో మూసీ ప్రాజెక్టు అంశాన్ని పార్టీ అధిష్టానం వద్ద రేవంత్ రెడ్డి దాచిపెట్టారన్నారు. అనేక సందర్భాల్లో సీఎం, డిప్యూటీ సీఎం పరస్పర విరుద్ధమైన ప్రకటనలు ఇచ్చారని బీజేఎల్పీ నేత గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మూసీకి లక్షా యాభై వేల కోట్లు అని చెప్తే.. భట్టి విక్రమార్క దాన్ని ఖండించారని గుర్తు చేశారు. మూసీ, హైడ్రాల అంశంలో భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డిల వ్యాఖ్యలు ఒకలా ఉంటే.. సీఎం రేవంత్ మాత్రం మరోలా మాట్లాడుతున్నారని విమర్శించారు.

## గురుకుల విద్యార్థులకు దీపావళి శుభాకాంక్షలు

హైదరాబాద్: తెలంగాణలో గురుకులాలకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెరిగాయి. 40శాతం మేర పెంచినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఎన్నడు లేని విధంగా హాస్టల్, గురుకుల విద్యార్థులకు డైట్ కాస్మోటిక్ 40శాతం పెంచారని గుర్తుచేశారు. శుక్రవారం సచివాలయంలో మంత్రి సీతక్క మీడియా సమావేశంలో మాట్లాడుతూ... ఎన్నడూ లేని విధంగా విద్యార్థులకు 40శాతం చార్జీలను పెంచిన సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పెంచిన చార్జీలు అందుకుబోతున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఇదే విద్యార్థులకు అసలైన దీపావళి అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు.

ఇక హాస్టల్ విద్యార్థులు అర్థాకలితో అవస్థలు పడాల్సిన అవసరం లేదని చెప్పారు. పెంచిన చార్జీలతో విద్యార్థులకు పోషకాహారం అందించాల్సిన బాధ్యత టీచర్లది, హాస్టల్ సిబ్బందిది అని తెలిపారు. హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలు గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లిస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.డైట్ చార్జీలు ఏడేళ్లుగా, కాస్మోటిక్ చార్జీలు గత 16 సంవత్సరాలుగా పెరగలేదని అన్నారు. ఏడు సంవత్సరాల క్రితం డైట్ చార్జీలు కొంచెం పెంచి.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రచారం చేసుకుందని మంత్రి సీతక్క మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో విద్యా వ్యవస్థ నాశనమైందని మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క విమర్శలు చేశారు. విద్యా శాఖకు కేసీఆర్ ప్రభుత్వం చేసింది శూన్యమని విమర్శించారు. విద్యార్థుల బాధలు తెలిసిన రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్నారని తెలిపారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉండాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని ఉద్ఘాటించారు. ఏడేళ్లుగా ధరలు విపరీతంగా పెరిగాయని.. అందుకు అనుగుణంగా డైట్, కాస్మోటిక్ ఛార్జీలు ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచకపోవడంతో పిల్లలు అర్ధాకలితో ఇబ్బందులు పద్దారని ఆవేదన వ్యక్తం చేశారు.

# తప్పిదాలకు తావులేకుండా ఇంటింటి సర్వే.

**కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు.**

**ఇళ్ల జాబితా రూపకల్పన ప్రక్రియ పరిశీలన.**

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, నవంబర్ 01**

: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల వివరాల సేకరణకై ప్రభుత్వం ఈ నెల 6 వ తేదీ నుండి ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను జిల్లాలో పక్కాగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఇంటింటి కుటుంబ సర్వేకు సంబంధించి ఆయా నివాస ప్రాంతాలలో ఇళ్ల జాబితాల రూపకల్పన ప్రక్రియ శుక్రవారం ప్రారంభమవగా, జిల్లా పాలనాధికారి క్షేత్రస్థాయి సందర్శన జరిపి ఈ ప్రక్రియను నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. బోధన్ మున్సిపల్ పట్టణంలోని



రాకాసి పేట్ తో పాటు లంగ్డాపూర్ గ్రామంలో అధికారులు, సిబ్బంది ఇళ్ల జాబితా రూపకల్పన కోసం చేపడుతున్న చర్యలు, పాటిస్తున్న పద్ధతులను కలెక్టర్ పరిశీలన జరిపారు. ఇళ్లకు సర్వేకు సంబంధించిన స్టిక్కర్లను అతికిస్తూ, వాటిపై నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించిన కలెక్టర్, అధికారులకు కీలక సూచనలు చేశారు. ఏ ఒక్క నివాస గృహం సైతం మినహాయించబడకుండా పక్కా పరిశీలనతో హౌస్ లిస్టింగ్ చేయాలని, ఎలాంటి గందరగోళానికి తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. ముఖ్యంగా మున్సిపల్ పట్టణాల పరిధిలో ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. సర్వే కోసం ఎన్యుమరేషన్ బ్లాక్ లోని ప్రతి ఇంటికి క్రమానుగత సంఖ్యను కేటాయించాలని, ఇళ్ల జాబితా పక్కాగా రూపొందితే సర్వే సమగ్రంగా చేపట్టబడుతుందని అన్నారు. నిర్దేశిత సర్వే ప్రణాళికను అనుసరిస్తూ మూడు రోజుల్లోపు హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఎక్కడ కూడా డూప్లికేషన్ లేకుండా హౌస్ లిస్టింగ్ చేయాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ జిల్లాలో సర్వే ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ నెల 06 వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఇంటింటి సమగ్ర సర్వే ప్రక్రియపై ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, తహసీల్దార్ విఠల్ తదితరులు ఉన్నారు.

# 597 మంది పేకాట రాయుళ్ళు అరెస్టు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 1**

**రూ" 11,47,000 స్వాదీనం.**

**ఇన్ చార్జి సీపీ సింధుశర్మ వెల్లడి.**




జిల్లా వ్యాప్తంగా 597 మంది పేకాట రాయుళ్ళను అరెస్టు చేయడం తో పాటు రూ" 11,47,000 నగదు స్వాదీనం చేసుకున్నట్టు ఇన్ చార్జి సీపీ సింధుశర్మ తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో సీపీ సింధుశర్మ వివరాలు వెల్లడించారు.దీపావళి సందర్భంగా పోలీస్ కమిషనరేట్ పరిధిలో బుధ, గురువారాల్లో మొత్తం 116 కేసులు నమోదు కాగా, నిజామాబాద్ డివిజన్ లో 53 కేసులు, 267 మందిని అరెస్టు చేశామన్నారు. రూ" 5,03,570 నగదును స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. అలాగే ఆర్మూర్ డివిజన్ లో 26 కేసులు నమోదు చేసి 138 మందిని అరెస్టు చేశామని, రూ" 2,85,570 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. బోధన్ డివిజన్ లో 37 కేసుల్లో 192 మందిని అరెస్టు చేసి, రూ" 3,58,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

# డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపుపై హర్షణీయం.

**బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కె నాగరాజు, ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవంత్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 1:**

తెలంగాణ ప్రభుత్వ వసతిగృహ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ ఛార్జీలను పెంచడాన్ని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కేంపుల నాగరాజు, బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవంత్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, విద్యాశాఖ ముఖ్య



కార్యదర్శి బుర్రా వెంకటేశం కు వారు ప్రత్యేక కృతజ్ఞత, అభినందనలు తెలిపారు. 2017 నుంచి ఇప్పటివరకు విద్యార్థుల కాస్మెటిక్, డైట్ చార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులు ఎంతో ఇబ్బందులకు గురయ్యారని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకొని కాస్మెటిక్, మెస్ ఛార్జీలు పెంచడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.

రాష్ట్రం ప్రభుత్వం ఎస్సీ,

ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతిగృహాలు, తెలంగాణ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలోని వసతిగృహాలు, అన్ని వసతి గృహాలకు డైట్, కాస్మొటిక్ ఛార్జీల పెంపును వెంటనే అమలు చేయలని కోరారు. విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందించే విధంగా, అన్ని వసతి గృహాల్లో సక్రమంగా అమలు అయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుని విద్యార్థులకు మంచి ఆహారం అందించాలని అన్నారు.

# ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలి.

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్.**

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, నవంబర్ 1:**



ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వాసవీ హై స్కూల్ సమీపంలోని వార్డులో జరుగుతున్న ఇంటింటి సర్వే ను కలెక్టర్ పరిశీలించారు. సర్వే ప్రతీ ఇంటిలో నిర్వహించాలని, కుటుంబంలోని ప్రతీ ఒక్కరి సమాచారాన్ని సేకరించాలని తెలిపారు. ఆ ఇంటిలోని సమాచారాన్ని సేకరించిన అనంతరం స్టిక్కర్ అంటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రంగనాథ్ రావు, మున్సిపల్ చైర్ పర్సన్ ఇందుప్రియా, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏటీసీ కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, నవంబర్ 01**

జిల్లాలోని వివిధ ప్రాంతాలలో కొనసాగుతున్న అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ) నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేయించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు సూచించారు. బోధన్నా పట్టణ శివారులో నూతనంగా నిర్మిస్తున్న ఏటీసీ భవన సముదాయం నిర్మాణ పనులను కలెక్టర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటివరకు కేవలం బేస్ లెవెల్ వరకే నిర్మాణం పనులు జరగడాన్ని గమనించిన కలెక్టర్, పనుల్లో జాప్యంపై అధికారులను ప్రశ్నించారు. వర్షపు జలాలు నిలిచి ఉండడంతో పనులు చేపట్టలేకపోయామని, ఇకపై వేగంగా



పనులు చేపట్టి వచ్చే ఫిబ్రవరి నాటికి పూర్తి చేస్తామని నిర్మాణ పనులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కంపెనీ ప్రతినిధులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఐ.టీ.సీలలో తరగతులు నేటి నుండి ప్రారంభం అయినందున భవన నిర్మాణ పనులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా, సొంత భవనాలు అందుబాటులోకి వచ్చే లోపు ప్రత్యామ్నాయంగా ఐ.టీ.ఐలలో ఏ.టీ.సీ తరగతులను నిర్వహించాలని అధికారులకు సూచిం చారు. అభ్యర్థులకు శిక్షణ కోసం కేటాయించబడిన యంత్రసామాగ్రి, ఇతర మెటీరియల్ పూర్తి స్థాయిలో వినియోగం అయ్యేలా చూడాలన్నారు. నాణ్యతతో యుద్ధప్రాతిపదికన భవన నిర్మాణ పనులు జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ విఠల్, వైస్ ప్రిన్సిపాల్ సరోజినీదేవి ఉన్నారు.

# ఏం ఉద్ధరించారని పాదయాత్ర కెటిఆర్ ప్రకటనపై మండిపడ్డ బండి

కరీంనగర్: ఏం ఉద్ధరించారని పాదయాత్ర చేస్తారంటూ కెటిఆర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ ఘాటు విమర్శలు చేశారు. పదేళ్ల పాలనలో ఏం ఒరగబెట్టారని నిలదీసారు. పార్టీ కార్యకర్తల ఆకాంక్షల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించగా...ఈ వార్తలపై కేంద్రమంత్రి బండి సంజయ్ స్పందిస్తూ విమర్శలు గుప్పించారు. పనిలో పనిగా కాంగ్రెస్ ప్రభుత్వంపైనా మండిపడ్డారు. బండి సంజయ్ శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. పాదయాత్ర చేస్తా అనడానికి సిగ్గు ఉండాలన్నారు. ఏం ఉద్ధరించారని పాదయాత్ర చేస్తా అంటున్నవ్ కేటీఆర్ అని ప్రశ్నించారు. 'మేం పాదయాత్ర చేస్తే దాడులు చేశారు. ముందు కేసీఆర్‌ను ఫామ్ హౌస్ నుంచి బయటకు రమ్మను. తాగి, తింటూ కేసీఆర్ ఎంజాయ్ చేస్తున్నాడు. నాయకుడు లేని నావ బీఆర్ఎస్. కేటీఆర్‌ను జనం ఛీధరించుకుంటున్నారు' అంటూ వ్యాఖ్యలు చేశారు.ఆరు గ్యారంటీలను అమలు చేశామని పాదయాత్ర చేసే దమ్ము కాంగ్రెస్‌కుఉందా అని కూడా ప్రశ్నించారు. రైతుభరోసా ఉందో లేదో తెల్వదని. బోనస్ ఇస్తారో లేదో చెప్పరని మండిపడ్డారు. 29 జీవోను రద్దు చేయకపోతే ఊరుకోమని హెచ్చరించారు. ఏడాది పాలనలో ఒక్క హామీ అమలు కాలేదన్నారు.
కర్ణాటకలో ఉచిత బస్సు పథకం రద్దు చేస్తున్నారన్నారు.

దీపావళికి ఏవో బాంబులన్నారని.. ఇప్పుడు సైలెంట్ అయ్యారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒక్కటే.. స్కాములన్నీ ఏమయ్యాయో చెప్పాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. కాగా.. తెలంగాణ వ్యాప్తంగా పాదయాత్ర చేయాలని మాజీ మంత్రి కేటీఆర్ నిర్ణయం తీసుకున్నారు. పార్టీ కార్యకర్తల ఆకాంక్షల మేరకు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేస్తానని ఆయన చెబుతున్నారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ప్రజలతో కేటీఆర్ స్పష్టం చేశారు. బిజెపి ఈ ప్రకటనపై ఘాటుగానే స్పందిచింది.

# ఇందిరమ్మ కమిటీలతో కాంగ్రెస్ మోసం.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 1:**

**నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేస్తే సహించం.**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ హెచ్చరిక.**

ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు ఇళ్ళు పంచాలని ప్రభుత్వం కుట్ర చేస్తుందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ గుప్త ఆరోపించారు. నిజమైన లబ్ధిదారులకు అన్యాయం చేస్తే సహించం అని హెచ్చరించారు. శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎమ్మెల్యే దన్ పాల్ కాంగ్రెస్ ప్రభుత్వం తీరును తీవ్రంగా తప్పు పట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం దీపావళి కానుకగా ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ చేపడతాం అని చెప్పి, ఇందిరమ్మ కమిటీలతో నిజమైన అర్హులైన గరిబోళ్ళని మోసం చేయాలని చూస్తుందని అన్నారు. నియోజకవర్గంలో అర్హులైన ఇందిరమ్మ ఇళ్ళ జాబితా ప్రజాక్షేత్రంలో నిర్ణయించాలి, 3500 ఇళ్ళతో పాటు కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిజమైన, అర్హులైన గరిబోళ్ళకి ఇవ్వాలని డిమాండ్ చేశారు.గత ప్రభుత్వం పదేళ్లు అధికారంలో ఉండి



తెలంగాణలో ముఖ్యంగా నిజామాబాదు అర్బన్ నియోజకవర్గంలో ఒక్క ఇళ్ళు కూడా ఇవ్వలేదని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ల పేరుతో ప్రజలను మోసం చేసి కాంట్రాక్టర్ల దగ్గర కమిషన్లకు దందుకుందని అన్నారు. అందుకు ప్రజలుమార్పు కావాలని, కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు నమ్మి ఆ పార్టీకి అధికారం కట్టబెట్టారని అన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పి ఇప్పటివరకు ఒక్కటి కూడా దిక్కు లేదని పేర్కొన్నారు.ప్రస్తుతం నిజమైన అర్హులైన వారికీ కాకుండా, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఇళ్ళు ఇవ్వడానికి కుట్రలు చేస్తుందని అన్నారు.
నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యేకు తెలియకుండా ప్రభుత్వం ఇందిరమ్మ కమిటీ పేరుతో కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తల పేర్లను ఎంపిక చేస్తాం అంటే మరో ఉద్యమాన్ని చూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

# ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహం ధ్వంసం ముంబై వాసి సల్మాన్ సలీమ్ అరెస్ట్

**హైదరాబాద్:** సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతడిని ముంబైకి చెందిన సల్మాన్ సలీమ్ ఠాగూర్ అలియాస్ సల్మాన్ (30)గా గుర్తించారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే దురుద్దేశంతో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న సదస్సుకు సల్మాన్ హాజరయ్యాడని, ఈ క్రమంలోనే ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడని పోలీసులు తెలిపారు. ఈ సదస్సుకు 151 మంది వచ్చారని, వారికి నిర్వాహకులు హోటల్లో వసతి కల్పించారని పోలీసుల విచారణలో తేలింది.
పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 14న తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోకి
ప్రవేశించి గర్భగుడి తాళం పగులగొట్టాడు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. గుడిపైకి చేరుకొని పైన ఉన్న విగ్రహాన్ని పగులగొట్టడానికి యత్నించాడు. స్థానికుడు ఒకరు గమనించి ఆగంతకుడిని పట్టుకున్నాడు. ఈలోపు మరికొందరు స్థానికులు చేరుకొని ఆగ్రహావేశాలతో నిందితుడిపై దాడి చేశారు. స్థానిక మార్కెట్ పోలీసులకు నిందితుడిని అప్పగించారు. గాయాలపాలైన అతడిని పోలీసులు ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించారు. ఆ తర్వాత విచారణ చేయగా అతను ముంబైకి చెందినవాడని, పేరు సల్మాన్, బీఈ (కంప్యూటర్స్) గ్రాడ్యుయేట్ అని తేలింది.

# 7న కమ్యూనిస్ట్ కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశాలు

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, నవంబర్ 1**

కమ్యూనిస్టు కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశాలను ఈనెల 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్నట్లు ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్టోబర్ విప్లవ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించనున్న ఈ సమావేశాలు, హైదరాబాద్ లోని బాగ్ లింగంపల్లి, ఓంకార్ భవన్ లో జరుగుతాయన్నారు. సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు.



# అఘోరి శ్రీనివాస్ ఇంటి వద్ద బందోబస్తు

**మంచిర్యాల:** గత కొన్ని రోజులుగా తెలంగాణలో అఘోరి అలియాస్ శ్రీనివాస్ విషయం హాట్ టాపిక్‌గా మారింది. అఘోరిని చూడటానికి పరిసర ప్రాంతాల ప్రజలు భారీగా తరలి వస్తున్నారు.బయట వ్యక్తులను గ్రామంలోకి పోలీసులు అనుమతించడం లేదు. బెల్లంపల్లిలో ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను అఘోరి అలియాస్ శ్రీనివాస్ తల్లిదండ్రులు కలిశారు. కొన్ని మీడియా సంస్థల వల్ల ఇబ్బంది పడుతున్నామని ఫిర్యాదు చేశారు. తమ ఇంటి వైపు మీడియా రాకుండా చూడాలని ఎమ్మెల్యేను కుటుంబ సభ్యులు కోరారు. అఘోరి ఆత్మార్పణం చేసుకోకుండా చూడాలని ఎమ్మెల్యే పోలీసులకు సూచించారు. ఈ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. అఘోరికి అవసరమైన భద్రత కలిపించాలని పోలీసులను ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశించారు.సోషల్ మీడియాలో అఘోరి వీడియోలు వైరల్ అవుతున్నాయి. దీంతో అఘోరి ఇంటి దగ్గర హైటెన్షన్ నెలకొంది. మంచిర్యాల జిల్లాలోని నెన్నెల మండలం కుశ్నపల్లిలో అఘోరి అలియాస్ శ్రీనివాస్ గృహ నిర్భంధంలో ఉన్నారు. సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో ఆత్మార్పణం చేసుకుంటానని అఘోరి ప్రకటించడంతో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. కుటుంబ సభ్యుల సంరక్షణలో ఉంచి పోలీసులు రెండంచెల బందోబస్తు నిర్వహిస్తున్నారు.

# 'మాస్ వేణుమా మాస్.. క్లాస్ వేణుమా క్లాస్'..




రామ్ చరణ్ నటిస్తున్న గేమ్ ఛేంజర్ సినిమా గురించి మెగా ఫ్యాన్స్ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఈ మూవీ గురించి ఏ చిన్న అప్‌డేట్ వచ్చిన అది ట్రెండింగ్‌లో ఉంటుంది. తాజాగా ఈ సినిమాలో రామ్ చరణ్ క్యారెక్టర్ గురించి ఓ చిన్న లీక్ బయటికి వచ్చింది. మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'గేమ్ ఛేంజర్' ప్రస్తుతం నిర్మాణ దశలో ఉంది. ఈ చిత్రాన్ని చాలా ఏళ్లుగా డైరెక్టర్ శంకర్ చెక్కుతూనే ఉన్నారు. ఈ మూవీలో కియారా అద్వాణి హీరోయిన్‌గా నటిస్తుంది. ఇక ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామాకి ప్రముఖ రచయిత సాయి మాధవ్ బుర్రా డైలాగ్స్ రాస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమాపై, అలానే రామ్ చరణ్ పాత్ర గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు.

ఏది కావాలంటే అది.... రామ్ చరణ్ ఈ చిత్రంలో మాస్ పాత్రలో కనిపిస్తారా లేదా క్లాస్ రోల్‌లో కనిపిస్తారా అని అడిగిన ప్రశ్నకి బుర్రా ఆసక్తికర ఆన్సర్ ఇచ్చారు. "రామ్ చరణ్ క్యారెక్టర్‌కి సినిమాలో మల్టిపుల్ వేరియేషన్స్ ఉంటాయి. మాస్, క్లాస్, రగ్గడ్, డిగ్నిఫైడ్.. ఇలా మీరు ఏది కోరుకుంటే అది ఆ పాత్రలో కనిపిస్తుంది. ఎందుకంటే చరణ్‌లో ఆ షేడ్స్ అన్నీ మీకు కనిపిస్తాయి. ఒక సామాన్యుడు తన జీవితంలో వివిధ సందర్భాల్లో వివిధ రకాలుగా ప్రవర్తిస్తాడు కదా.. అలానే గేమ్ ఛేంజర్‌లో కథానాయకుడి పాత్రను రూపొందించారు." అంటూ సాయి మాధవ్ చెప్పారు. ఈ మూవీలో బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో ఎస్ జే సూర్య, శ్రీకాంత్, జయరామ్, నవీన్ చంద్ర, అంజలి, సునీల్, శుభలేక సుధాకర్ వంటి వారు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఎస్ఎస్ థమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. నెక్ట్స్ ప్రాజెక్ట్‌ఇక గేమ్ ఛేంజర్‌తో పాటు రామ్ చరణ్ చేతిలో 16 మూవీ ఉంది. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు ఈ సినిమాను డైరెక్ట్ చేస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తుందనే టాక్ ఉంది. ఇక 16ను మైత్రి మూవీ మేకర్స్ సమర్పిస్తుండగా సుకుమార్ రైటింగ్స్ కో ప్రొడ్యూసింగ్ చేయబోతుంది. ఇక ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకి మ్యూజిక్ అందిస్తున్నారు. ఇక ఈ చిత్రంలో బిగ్‌బాస్ ఫేమ్, సీరియల్ నటుడు అర్జున్ అంబటి కూడా ఓ రోల్‌లో కనిపించబోతున్నాడు. ఇటీవల బిగ్‌బాస్ 7 వేదికపై అర్జున్‌కి ఈ అవకాశాన్ని ఇచ్చారు బుచ్చి బాబు. అయితే అర్జున్ ఏ పాత్రలో కనిపించబోతున్నా డో మాత్రం చెప్పలేదు. ఇక ఈ సినిమా ఉత్తరాంధ్ర బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతు న్నట్లు తెలుస్తోంది. అందుకోసమే ఉత్తరాంధ్ర యాసలో మాట్లాడగలిగే నటీనటుల కోసం ఆడిషన్ కూడా నిర్వహిస్తుంది మూవీ టీమ్.



# అయాన్ పాట మీద షారుఖ్..





లుట్ పుట్ గయా పాటను పాడి అయాన్ మరోసారి నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అయ్యాడు. ఆ వీడియో ఏకంగా షారుఖ్ వరకు చేరుకుంది. షారుఖ్ తన ట్విట్టర్‌లో అయాన్ పాడిన ఈ పాటను షేర్ చేశాడు. ఈ పాటను పాడిన తీరుకు ఫిదా అయ్యాడు. ఇకపై తన పిల్లలను శ్రీవల్లి పాట పాడేలా ప్రాక్టీస్ చేయిస్తానని అన్నాడు. దానిపై బన్నీ స్పందించాడు.

అల్లు అయాన్ రేంజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. సోషల్ మీడియాలో ఏ మీమ్, ఏ ట్రోల్ చూసినా అయాన్ హవానే కనిపిస్తుంటుంది. అన్ని రకాలుగా ఓ వీడియోను ఫన్నీగా ట్రోల్ చేయొచ్చా? అని అయాన్ వీడియోలను చూస్తే తెలుస్తుంది.అయాన్ ఎప్పుడూ సందడి తిరుగుతూ ఉంటాడు. తనకు నచ్చినట్టుగా ఉంటాడు.అల్లు అర్జున్ కొడుకు, స్టార్ కిడ్ అన్న బంధనాల మధ్య అయాన్ కనిపించడు. చాలా ఫ్రీగా తనకు నచ్చినట్టుగా ఉంటాడు. అలా అయాన్ బయట ఈవెంట్లు, ఫంక్షన్లలో చేసే అల్లరికి సంబంధించిన వీడియోలు ఎప్పుడూ వైరల్ అవుతుంటాయి.

తాజాగా అయాన్ పాడిన ఓ పాట నేషనల్ వైడ్‌గా ట్రెండ్ అయింది. లుట్ పుట్ గయా అంటూ సరదాగా అలా హమ్ చేశాడు అయాన్. దీంతో ఒక్కసారిగా మీడియాలో వైరల్ అయింది. చివరకు ఇది ఏకంగా బాలీవుడ్ బాద్ షా కంట్లో పడింది. షారుఖ్ ఈ అయాన్ వీడియోని చూశాడు. లుట్ పుట్ గాయ అంటూ తన డంకీ సినిమాలోని పాటను పాడటంతో కింగ్ ఖాన్ ఫిదా అయ్యాడు. ఇక అయాన్ మీద, అల్లు అర్జున్ మీద షారుఖ్ ప్రేమను కురిపించాడు.

థాంక్యూ లిటిల్ వన్.. నువ్వు ఫ్లవర్, ఫైర్ కలయికలా ఉన్నావ్.. అల్లు అర్జున్ శ్రీవల్లి పాటను నా పిల్లల చేత ప్రాక్టీస్ చేయిస్తా.. హహ అని ట్వీట్ వేశాడు. ఇక షారుఖ్ ట్వీట్ మీద బన్నీ స్పందించాడు. షారుఖ్ జీ.. సో స్వీట్ ఆఫ్ యూ.. మీ మెసెజ్ చూసి ఎంతో ఆనందం వేసింది.. అంటూ రిప్లై ఇచ్చాడు.అది అయాన్ రేంజ్ అని, సరదా సరదాకే అలా పాటను పాడేస్తే.. షారుఖ్ రిప్లై ఇచ్చే రేంజ్ అయాన్‌ది అంటూ ఫన్నీగా ట్రోల్స్, మీమ్స్ పడుతున్నాయి. అయాన్ మోడల్ బోల్తే అంటూ మళ్లీ ట్రెండ్ చేస్తున్నారు. ఏది ఏమైనా అయాన్ సైతం ఇప్పుడు నేషనల్ వైడ్‌గా లుట్ పుట్ గయాతో వైరల్ అవుతున్నాడు.

# ఎక్కడికెళ్లినా వాళ్ళు ఉండాల్సిందే..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ చాలాకాలంగా బిగ్ బడ్జెట్ సినిమాలతో చాలా బిజీగా ఉన్నాడు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ చాలాకాలంగా బిగ్ బడ్జెట్ సినిమాలతో చాలా బిజీగా ఉన్నాడు. ఇక అప్పుడప్పుడు కాస్త రెస్ట్ తీసుకోవడానికి విదేశాలకు వెళుతూ ఉంటాడు. ప్రభాస్ ఒకప్పుడు ఈ రేంజ్ లో స్టార్ హోదా రాకముందు మాత్రం తన ఫామ్ హౌస్ లో ఎక్కువగా ఉండడానికి ఇష్టపడేవాడు. అయితే ప్రభాస్ కు ఒకే చోట ఉండాలన్నా కూడా అంతగా ఇష్టం ఉండదు. బయట కూడా తిరగాలని చాలా ఇంట్రెస్ట్ చూపిస్తూ ఉంటాడు. ఒకప్పుడు హైదరాబాద్లో బెస్ట్ ఫుడ్ ఏది ఉంటే అది ప్రభాస్ వెంటనే తినాలని అనుకునేవారు. చాలా ఇంటర్వ్యూలలో ఈ విషయాన్ని తెలియజేశాడు. ఆఖరికి లోకల్ పానీపూరి కూడా వదల్లేదు అని ఎన్నోసార్లు చెప్పాడు. అయితే ఇప్పటికి కూడా ప్రభాస్ అంతే సింపుల్ గా ఉండడానికి ఇష్టపడతాడు. కానీ బయట మాత్రం తిరిగే స్వేచ్ఛ ఉండదు కాబట్టి ఎక్కువగా విదేశాలకు వెళుతూ ఉన్నాడు. మోహన్ బాబు సంచలన లేఖ! అయితే అక్కడ కూడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రభాస్ ప్రత్యేకంగా ఒక ఇంటిని లేదా విల్లా లాంటివి రెంటుకు తీసుకుని ఉంటున్నట్లుగా తెలుస్తోంది. అందుకోసం ఖర్చు కూడా గట్టిగానే పెడుతున్నాడు. ఆ మధ్య ఇటలీలో కూడా ప్రభాస్ ఒక పెద్ద బంగ్లా తీసుకున్నాడు అని చాలా రకాల వార్తలు వచ్చాయి. సాహో సినిమా తర్వాత కొన్నాళ్ళు ప్రభాస్ అక్కడే రెస్ట్ తీసుకున్నాడు. అప్పుడప్పుడు యూఎస్ కూడా వెళ్లడం కామన్. ఇక రీసెంట్‌గా అతను లండన్ వెళ్లగా అక్కడ కూడా మరొక విల్లా ను రెంట్ తీసుకున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఆ విల్లా రెంట్ దాదాపు 60 లక్షలు అని తెలుస్తోంది. ఇక ప్రభాస్ తో పాటు అతని టీం కూడా ఎల్లప్పుడూ విదేశాలకు వెళ్లడం కామన్ గా మారిపోయింది. ముఖ్యంగా ప్రభాస్ కోసం ప్రత్యేకంగా ఒక చెఫ్ కూడా ఎల్లప్పుడూ అతని వెంటే ప్రయాణాలు చేస్తూ ఉంటాడు. అతని మేనేజర్స్ కూడా ప్రభాస్ తో పాటు విదేశాలకు వెళ్లాల్సిందే. ఇక ప్రభాస్ మంచి భోజనం ప్రియుడు కాబట్టి ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న చెఫ్ ఏ దేశం వెళ్లినా వెంట ఉండాల్సిందే. అతనికి ఇష్టమైన రకరకాల వంటలను తనే చేయడం, లేదంటే అక్కడ ఉన్న బెస్ట్ చెఫ్ లను పిలిపించి వండిం చడం లాంటివి చేస్తూ ఉంటారు. ఇక వారి కోస ం కూడా ఖర్చు గట్టిగానే చేస్తు న్న ప్రభాస్ మొత్తంగా విదేశా లకు హాలిడేస్ కోస ం వెళితే మాత్రం కోట్లల్లో ఖర్చు చేసే అవకాశం ఉన్నట్లుగా తెలు స్తోంది. ఏదేమైనా ప్రభాస్ వెళి తే అసిస్టెంట్లకు కూడా ఒక హాలి డే వెకేషన్ లాంటిదే అని చెప్పవచ్చు. ఒకవేళ వేరే వారు పనిలో చేరినా ప్రభాస్ మంచితనంకు ఫ్రెండ్స్ అయిపోతారు. ఎందుకంటే మన చుట్టూ ఉన్నవారు బాగుంటేనే మనం బాగుంటాము అని ప్రభాస్ నమ్ముతారు.

రష్మిక ఈ మధ్య యానిమల్‌తో సక్సెస్ కొట్టింది. కానీ యానిమల్ సక్సెస్ పార్టీ, సక్సెస్ మీట్‌లో మాత్రం ఎక్కడా కనిపించలేదు. దీంతో రష్మిక మీద రకరకాల రూమర్లు వచ్చాయి. యానిమల్ సక్సెస్‌లో పాలు పంచుకోకపోవడంపై రష్మిక క్లారిటీ ఇచ్చింది. రష్మిక ప్రస్తుతం పలు సినిమాలతో బిజీగా ఉంది. యానిమల్ మూవీ రిలీజ్ అయిన తరువాత వెంటనే మళ్లీ గర్ల్ ఫ్రెండ్ అనే ఓ లేడీ ఓరియెంటెడ్ సబ్జెక్ట్‌ను ఓకే చేసింది. బాలీవుడ్, టాలీవుడ్ చిత్రాలతో రష్మిక బిజీగానే ఉంటోంది.అయితే యానిమల్ మూవీ సక్సెస్ మీట్ గానీ, సక్సెస్ పార్టీలో గానీ రష్మిక కనిపించలేదు. దీంతో రష్మికకు, యానిమల్ టీంకు మధ్య గొడవలు జరిగాయని, గ్యాప్ వచ్చిందని రూమర్లు వైరల్ అయ్యాయి. ఈ రూమర్లు కాస్త రష్మిక వద్దకు చేరినట్టుగా ఉన్నాయి. దీంతో రష్మిక ఇలా స్పందించింది. షూట్ గ్యాప్‌లో ఇలా ఫోటోలు షేర్ చేస్తూ తన వాదన వినిపించింది. షూటింగ్ గ్యాప్‌లో రష్మిక ఇలా కాస్త టైం తీసుకుంది. తన లుక్ రివీల్ కాకుండా ఫోటోను షేర్ చేసింది. ఇప్పుడు కొత్త సినిమాకు సంబంధించిన

# ఆ ఒక్కపదంతో దొరికిపోయిందే..

షూటింగ్‌లో ఉన్నాను.. అందుకే లుక్ రివీల్ కాకుండా ఇలా అడ్డు పెట్టి ఫోటోలను షేర్ చేస్తున్నాను అని రష్మిక తెలిపింది. అయితే యానిమల్ సినిమా సక్సెస్ మీట్‌లో తాను కనిపించడం లేదని, ఆ సక్సెస్‌లో భాగస్వామ్యం తీసుకోవడం లేదని అనుకోకండి.. ఇలా వెంటనే సినిమా షూటింగ్‌లు ఉండటంతో బిజీగా గడపాల్సి వస్తుందని క్లారిటీ ఇచ్చింది. ఇక రష్మిక ఇలా వేసిన పోస్ట్ మీద నెటిజన్ స్పందించాడు. ఇలా ఎలాగో కాస్త గ్యాప్ తీసుకున్నావ్.. ఆ గ్యాప్‌లో నాకు రిప్లై ఇవ్వొచ్చు కదా? అని అడిగేశాడు. దానికి రష్మిక ఇలా ఫన్నీగా స్పందించింది. గ్యాప్‌లో అంట.. వర్క్ గ్యాప్‌లో ఈ ఫోటో తీసుకున్నాన్ రా.. సెల్ఫీ తీసుకు న్నప్పుడు గ్యాప్ లేకుండే అని ట్వీట్ వేసింది. ఇక ఈ ట్వీట్‌ను చాలా లోతుగా పరిశీలించిన కొంత మంది నెటిజన్లు.. ఇది రష్మిక స్లాంగ్ కాదని, రష్మిక స్లాంగ్ మీద విజయ్ దేవరకొండ ప్రభావం ఉందని, లేకుండే అని పదాన్ని విజయ్ మాత్రమే ఎక్కువగా వాడుతాడని, విజయ్ స్లాంగ్ అనేది రష్మిక మీద చాలానే ప్రభావం చూపిం చిందని కామెంట్లు చేస్తున్నారు. వీరిద్దరూ ఒక్కటే అని మళ్లీ రూమర్లు క్రియేట్ చేస్తున్నారు. కానీ తామిద్దరం బెస్ట్ ఫ్రెండ్స్ అని విజయ్, రష్మిక చెబుతుంటారు. వీరిద్దరి విషయంలో ఏం జరుగుతుం దనేది కాలమే చెప్పాలి.



# నయన్-విఘ్నేష్ సింగపూర్‌లో జాలీ ట్రిప్

ఆ ఇద్దరూ టీ-షర్టులు జీన్స్ ధరించి చాలా క్యాజువల్ గా కనిపించారు. నయన్ తాను షేర్ చేసిన ఫోటోలకు 'ఖో గయే హమ్ కహాన్' పాటను నేపథ్య స్కోర్‌గా ఉపయోగించా రు. నయనతార- విఘ్నేష్ శివన్ సింగపూర్‌లో వెకేషన్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. ఈ జంట రొమాంటిక్ బ్లాక్ అండ్ వైట్ ఫోటో తాజాగా విడుదలై వైరల్ గా మారింది. ఈ ఫోటోలో విఘ్నేష్ తన సతీమణి నయనతార మెడ చుట్టూ చేతులు వేసి తనను వెనుక నుండి కౌగిలించుకోవడం హైలైట్ అయింది. ఆ ఇద్దరూ టీ-షర్టులు జీన్స్ ధరించి చాలా క్యాజువల్ గా కనిపించారు. నయన్ తాను షేర్ చేసిన ఫోటోలకు 'ఖో గయే హమ్ కహాన్' పాటను నేపథ్య స్కోర్‌గా ఉపయోగించారు. విఘ్నేష్ తన ఇన్‌స్టా ఖాతాలో సింగపూర్‌లోని నైట్ వైబ్స్ నుంచి కొన్ని వీడియోలు ఫోటోలను షేర్ చేసారు. ఈ అందమైన జంటకు వివాహమై రెండేళ్లవుతోంది. వారికి ఉయిర్-ఉలగ్ అనే ఇద్దరు మగపిల్లలు ఉన్నారు. వెకేషన్ లో తమ కిడ్స్ తో కలిసి ఈ జంట విలువైన సమయాన్ని ఆస్వాధిస్తున్నారు. అయినా దంపతులు కేవలం రొమాంటిక్ డేట్ కి సంబంధించిన ఫోటోలను మాత్రమే షేర్ చేసారు. ప్రస్తుతం ఈ రొమాంటిక్ డేట్ కి సంబంధించిన ఫోటోలు నెటిజనుల్లో వైరల్ అవుతున్నా యి. దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డ్స్ 2024లో షారూఖ్ ఖాన్, కరీనా, నయనతార మెరుపులు మెరిపించిన సంగతి తెలిసిందే. నయనతార 'జవాన్' చిత్రానికి ఉత్తమ నటి అవార్డును గెలుచుకుంది. విఘ్నేష్ శివన్ తన తదుపరి దర్శకత్వ వెంచర్ 'లవ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్' చిత్రం కోసం పని చేస్తున్నాడు. ఇందులో ప్రదీప్ రంగనాథన్, సూర్య, కృతి శెట్టి ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్నారు. నయనతార చివరిగా 'అన్నపూర్ణి: ది గాడెస్ ఆఫ్ ఫుడ్' సిరీస్‌లో కనిపించింది. తదుపరి ఎస్. శశికాంత్ దర్శకత్వం వహించిన 'టెస్ట్'లో కనిపించనుంది. ఈ చిత్రంలో ఆర్. మాధవన్, సిద్ధార్థ్, మీరా జాస్మిన్ ప్రధాన పాత్రలు పోషించారు.



# చాల పెద్ద విషయం

ఈ సినిమా కోసం వరుణ్ ప్రత్యేకంగా ఎయిర్ పోర్స్ లో ట్రైనింగ్ తీసుకుని మరీ సన్నదం అయ్యాడు. పవర్ ఫుల్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కథానాయకుడిగా శక్తి ప్రతాప్ సింగ్ తెరకెక్కిస్తోన్న 'ఆపరేషన్ వాలంటైన్' గురించి చెప్పాల్సిన పనిలేదు. మెగా ప్రిన్స్ చేస్తోన్న మరో భారీ సాహసం ఇది. ఎయిర్ ఫోర్స్ నేపథ్యంలో పుల్వామా ఎటాక్స్ ఆధారంగా చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. వాస్తవ సంఘటనలు ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు సినిమాకి మంచి బజ్‌ని తీసుకొచ్చాయి. ఈ డైరెక్టర్ కూడా సైలెంటుగానే.. ఈ సినిమా కోసం వరుణ్ ప్రత్యేకంగా ఎయిర్ పోర్స్ లో ట్రైనింగ్ తీసుకుని మరీ సన్నదం అయ్యాడు. పవర్ ఫుల్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతున్నాడు. వరుణ్ లుక్ ..క్యారెక్టరైజేషన్ ప్రతీది హైలైట్ చేస్తుంది. ప్రీ రిలీజ్ ఈవెంట్ లో సైతం మెగాస్టార్ చిరంజీవి బూస్టింగ్ తో వరుణ్ మరింత బలంగా జనాల్లోకి వెళ్తు న్నాడు. మెగా క్యాంప్ లోనే ప్రత్యేకమైన హీరోగా హైలైట్ అవుతున్నాడు. సాధారణంగా ఇలాంటి సినిమాల షూటింగ్ పూర్తి చేయడం అన్నది అంత సులభం కాదు.కొన్ని నెలలు పాటు శ్రమిస్తే తప్ప సాధ్యంకానిది. నటీనటులందరిపై ప్రత్యేకగా దృష్టి పెడితే తప్ప పర్ఫెక్ష న్ రాదు. అందుకోసం చేసిన పనే మళ్లీ మళ్లీ చేయాల్సి వస్తుంది. అందుకోసమే హీరోల కాల్షీట్లు కూడా ఎక్కువగానే కేటాయించాల్సి వస్తుంది. అవసరం మేర రీషూట్లు కూడా చేస్తుంటారు. అయితే ఆపరేషన్ వాలంటైన్ మాత్రం 75 రోజుల్లోనే పూర్తి చేసినట్లు తెలిపారు. అంటే ఈ సినిమా షూటింగ్ చాలా వేగంగా పూర్తి చేసినట్లు లెక్క. ఇలాంటి సినిమాలకు కనీసం ఆరు నెలలైనా షూటిం గ కే సమయం పడుతుంది. కానీ శక్తి ప్రతాప్ సింగ్ ఆ ఛాన్స్ తీసుకోలేదు. బడ్జెట్ లోనే షూట్ అంతా వేగంగా పూర్తిచేసినట్ల తెలుస్తోంది. ఇలాంటి సినిమాలు బడ్జెట్‌లో పూర్తి చేయడం కూడా చిన్న విషయం కాదు. ఎంతో ప్లానింగ్ ఉంటో తప్ప పనికాదు. ఈ విషయంలో శక్తి ప్రతాప్ సింగ్ ఘాజీ దర్శకుడు సంకల్ప్ రెడ్డి వ్యూహాన్నే అనుసరించి ముందుకెళ్తినట్లు తెలుస్తోంది. 75 రోజుల షూట్ అనంతరం గ్రాఫిక్స్ సహా ఇతర పనులకే ఎక్కువ సమయం పట్టినట్లు తెలుస్తోంది.

# ఈ వెయిటింగ్ ఎందుకో..?



ఒక హిట్టు పడ్డాక కూడా సీనియర్ స్టార్ హీరో టాలీవుడ్ కింగ్ నాగార్జున ఎందుకో ఇంకా కథల వేట కొనసాగిస్తూనే ఉన్నారు ఒక హిట్టు పడ్డాక కూడా సీనియర్ స్టార్ హీరో టాలీవుడ్ కింగ్ నాగార్జున ఎందుకో ఇంకా కథల వేట కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రేక్షకులు తన నుంచి ఎలాంటి సినిమాలు ఆశిస్తున్నారో నా సామిరంగ హిట్ తర్వాత ఒక క్లారిటీ వచ్చేసినట్టు భావిస్తున్న నాగార్జున ఇక మీదట అలాంటి సినిమాలతోనే సంక్రాంతి సీజన్ కు వస్తామని ప్రకటించారు. అయితే అనౌన్స్ మెంట్ అయితే చేశారు కానీ నాగార్జున నెక్స్ట్ సినిమా గురించి ఎలాంటి అప్డేట్ రాలేదు. అఫ్కోర్స్ ధనుష్ లీడ్ రోల్ లో శేఖర్ కమ్ముల డైరెక్ట్ చేస్తున్న సినిమాలో నాగార్జున కూడా భాగం అవుతున్నారు. కానీ అది మల్టీస్టారర్ సినిమానే అవుతుంది తప్ప సోలో సినిమా కాదు. నాగార్జున సోలో సినిమా కోసం అక్కినేని ఫ్యాన్స్ ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు. ఆమధ్య ఒకటి రెండు యాక్షన్ సినిమాలు చేసి బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టగా ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్స్ తో సూపర్ హిట్ కొడుతున్నారు నాగార్జున. ప్రస్తుతం తన దగ్గరకు వచ్చిన కథలన్నిటినీ జల్లెడ పట్టి సెలెక్టెడ్ స్క్రిప్ట్స్ ని కూడా ఇంకాస్త మెరుగుపరిచి అప్పుడు సినిమా చేయాలని భావిస్తున్నారట నాగార్జున. నాగార్జున మైల్ స్టోన్ మూవీ 100వ సినిమా ఎవరి డైరెక్షన్ లో వస్తుంది అన్నది తెలియాల్సి ఉంది. ఆ మధ్య గాడ్ ఫాదర్ డైరెక్టర్ మోహన్ రాజాతో నాగార్జున సినిమా ఉంటుందని వార్తలు వచ్చాయి. నాగార్జున, అఖిల్ లతో కలిసి ఒక క్రేజీ మల్టీస్టారర్ చేస్తున్నారని అన్నారు. కానీ ఏమైందో ఏమో కానీ ఆ ప్రాజెక్ట్ గురించి తర్వాత ఎలాంటి అప్డేట్ రాలేదు. నాగార్జున మోహన్ రాజాతో రిస్క్ ఎందుకని ఆ సినిమా కాదనుకున్నారని టాక్. నా సామిరంగ ఇచ్చిన హిట్ కిక్ తో నాగార్జున ఇక మీదట కథల విషయంలో చాలా జాగ్రత్త పడుతున్నారని తెలుస్తుంది. ఆడియన్స్ కు ఒక మంచి సినిమా అందిస్తే ఎప్పుడు వారు దాన్ని హిట్ చేస్తారని నా సామిరంగ తో మరోసారి తెలుసుకున్న నాగార్జున ఇక మీదట అలాంటి సినిమాలు చేయాలని ఫిక్స్ అయ్యారని తెలుస్తుంది. నాగార్జున దగ్గరకు పదుల కొద్ది స్క్రిప్ట్స్ రాగా వాటిలో ఒక 3 ఫైనల్ చేసినట్టు తెలుస్తుంది. వాటిలో ఏదో ఒకటి ఫైనల్ చేసి త్వరలో అనౌన్స్ చేస్తారని అంటున్నారు. నా సామిరంగ తో హిట్ ఇచ్చిన డైరెక్టర్ విజయ్ బిన్నీ కి కూడా మరో ఛాన్స్ ఇస్తారని టాక్.

# కవ్వించే చూపుల అందాల రాశి



అందాల ముద్దుగుమ్మ రాశి ఖన్నా టైట్ ఫిట్ డ్రెస్‌లో బెడ్‌పై పడుకుని ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది. ఒక వైపు స్లీవ్ లెస్ డ్రెస్‌తో కవ్విస్తోం ది.ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. ఈ అమ్మడు చిన్న హీరోలకు జోడీగా నటించి మెప్పించింది. అయితే స్టార్ హీరోలకు మాత్రం వాంటెడ్ అవ్వలేక పోయింది. అందాల రాశి పేరుకు తగ్గట్లుగానే అందంగా కనిపించడం కోసం ఆ మధ్య చాలా బరువు తగ్గింది. తెలుగుతో పాటు తమిళం మరియు ఇతర భాషల్లో కూడా ఈ అమ్మడు నటిస్తూ మెప్పించింది. సోషల్ మీడియాలో రెగ్యులర్ గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తూ ఉంది. ఆకట్టుకునే అందం ఈ అమ్మడి సొంతం అంటూ మరోసారి ఈ ఫోటోలతో నిరూపితం అయ్యింది. అందాల ముద్దుగు మ్మ రాశి ఖన్నా టైట్ ఫిట్ డ్రెస్‌లో బెడ్‌పై పడుకుని ఫోటోలకు ఫోజ్ ఇచ్చింది.

# మరోసారి అగ్ర హీరోకు ప్రశాంత్ నీల్ దెబ్బ!



ప్రశాంత్ నీల్ సలార్ తో క్లాష్ వల్లే షారుక్ సినిమాకి గట్టి దెబ్బ పడిందని స్పష్టంగా అర్థమవుతుంది. బాలీవుడ్ అగ్ర హీరో షారుఖ్ ఖాన్ గత ఏడాది పఠాన్, జవాన్ వంటి సినిమాల తో బ్యాక్ టు బ్యాక్ ఆల్ టైం బ్లాక్ బస్టర్స్ తో భారీ కం బ్యాక్ ఇచ్చిన విషయం తెలిసిందే. అప్పటివరకు వరుస ఫ్లాప్స్ తో కంప్లీట్ డౌన్ ఫాల్ లో ఉన్న షారుక్ 'పఠాన్' తో బాక్స్ ఆఫీస్ దగ్గర వెయ్యి కోట్లు కొల్లగొట్టి తన సత్తా ఏంటో చాటాడు. ఆ తర్వాత వెంటనే జవాన్ తో మరో వెయ్యి కోట్ల బ్లాక్ బస్టర్ అందుకున్నాడు. అలా బ్యాక్ టు బ్యాక్ రెండు ఆల్ టైం బ్లాక్ బస్టర్ డెలివరీ చేసిన షారుక్ తన తదుపరి చిత్రంగా రాజ్ కుమార్ హిరానీతో 'డంకీ' సినిమా చేశాడు. మొదటిసారి వీరి కాంబినేషన్ కలవడంతో ఈ ప్రాజెక్టుపై ముందు నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. కానీ రిలీజ్ తర్వాత ఈ సినిమా ప్రేక్షకుల్ని నిరాశపరిచింది. డంకీ కథ, కథనం పరంగా బాగానే ఉన్నా అదే సమయంలో వచ్చిన 'సలార్' తో పోటీ పడడం సినిమాకి పెద్ద మైనస్ గా మారింది. ముఖ్యంగా ప్రశాంత్ నీల్ సలార్ మూవీతో జరిగిన క్లాష్ వల్ల నార్త్ బెల్టులో 'డంకీ' బిజినెస్ కి భారీగా దెబ్బ పడింది. 'డంకీ' మూవీ ఇండియన్ నెట్ వర్త్ సుమారు 255 కోట్లు ఉన్నప్పటికీ.. సలార్ దాన్ని 150 కోట్లతో డామినేట్ చేసింది. అంతేకాకుండా వరల్డ్ వైడ్ గా చూసుకుంటే సలార్ ఫుల్ రన్ లో 600 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేస్తే, డంకీ 475 కోట్లతో సరిపెట్టుకుం ది. ప్రశాంత్ నీల్ సలార్ తో క్లాష్ వల్లే షారుక్ సినిమాకి గట్టి దెబ్బ పడిందని స్పష్టంగా అర్థమవుతుంది. ప్రశాంత్ నీల్ సినిమాలు షారుక్ సినిమాకి ఇబ్బందిగా మారడం ఇదే మొదటి సారి కాదు. 2018 లో కూడా 'కేజీఎఫ్ చాప్టర్ 1' షారుక్ ఖాన్ 'జీరో' మూవీతో పోటీ పడగా 'కేజీఎఫ్' హిందీలో ఏకంగా 45 కోట్లు వసూలు చేసి సూపర్ హిట్ అయితే 'జీరో' వరల్డ్ వైడ్ గా 90 కోట్లు కలెక్ట్ చేసి డిజాస్టర్ గా నిలిచింది. అయితే ఈ విషయంలో షారుక్ ఖాన్ ఫ్యాన్స్ జీరో, డంకి ఈ రెండు సినిమాలు డ్రా మా జానర్ కు చెందినవే అని వాదిస్తున్నారు. అదే పఠాన్, జవాన్ లాంటి భారీ స్థాయి యాక్షన్ సినిమాలతో ప్రశాంత్ నీల్ పోటీ పడ్డప్పుడు అసలు అగ్నిపరీక్ష మొదలవుతుందని అప్పుడే ఎవరి క్రేజ్ ఏంటో తెలుస్తుందని అంటున్నారు.